క్లుప్తంగా

ఏపీవో సూర్యమణి బాధ్యతల స్వీకారం



గొలుగొండ: జాతీయ ఉపాధి హామీ పథకంలో ఏపీవోగా సూర్యమణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికి వరకు ఇన్‌ఛార్జి ఏపీవోగా బాధ్యతలు చేపట్టిన రాధిక నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. సూర్యమణి రోలుగుంట మండలం ఏపీవోగా విధులు నిర్వహించి, బదిలీపై గొలుగొండ ఏపీవోగా వచ్చినట్టు చెప్పారు.

శాకాహారం ప్రాముఖ్యంపై అవగాహన

చోడవరం రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల చోడవరంలో బోటనీ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ శాకాహార దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. డాక్టర్ వి.రత్నభారతి, డాక్టర్ జె.లక్ష్మి మంగమ్మ, జె.నారాయణమూర్తి, సుధీర్ ప్రస్తుతం వస్తున్న జీవన సంబంధ వ్యాధుల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు ఈ అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు.

జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో మౌళి కిరణ్‌కు ప్రథమ బహుమతి

నర్సీపట్నం : విజన్ ఆఫ్ స్వర్ణాంధ్ర-2047 అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన డిబేట్ పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థి రావుల మౌళి కిరణ్ ప్రథమస్థానంలో నిలిచాడు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మెమెంటో, సర్టిఫికేట్ అందుకున్నాడు. జిల్లా స్థాయిలో కళాశాలకు పేరు తెచ్చిన విద్యార్థి మౌళి కిరణ్‌ను ప్రిన్సిపాల్ డా.బి.వి.పద్మావతి, అధ్యాపకుడు జి.చిన్నారావు అభినందించారు.

తాతయ్యబాబుకు హౌసింగ్ సిబ్బంది అభినందనలు



తాతయ్యబాబుకు అభినందనలు తెలుపుతున్న ఈఈ,డీఈ,ఏఈలు

బుచ్చెయ్యపేట : రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబును జిల్లా హౌసింగ్‌శాఖ అధికారులు మంగళవారం వడ్డాదిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల చైర్మన్‌గా నియమింపబడ్డ తాతయ్యబాబును ఈఈ నీరజ, డిప్యూటీ ఈఈలు,డీఈలుతో పాటు పలు మండలాలకు చెందిన ఏఈలు శ్రీనివాస్,రాజు, శ్రీఫణి, సూర్యారావు, సూర్యప్రకాష్,రెడ్డి, రామచంద్రరావు, ప్రసాద్, గోపి, నాయుడు, ప్రేమానందం, శ్రీనివాస్, నూకరాజు, వెలగ శ్రీను తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు, బిల్లుల మంజూరుపై తాతయ్యబాబుతో హౌసింగ్ సిబ్బంది చర్చించారు.

నూతన తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దార్ రమాదేవిని అభినందిస్తున్న నేతలు

మాడుగుల రూరల్ : స్థానిక తహసీల్దారు కె.రమాదేవిని వైస్ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎం.కోడూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రమణబాబు, చింతలూరు మాజీ సర్పంచ్ కల్యాణరాజు, నాయకులు ఆర్లె నాయుడు పాల్గొన్నారు.

గాంధీ వీధిలో నేడు గాంధీ జయంతి

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో గాంధీవీధికి ఎంతో ప్రత్యేకత ఉంది. దేశ నాయకుల విగ్రహాలకు కేరాఫ్ అడ్రస్‌గా కె.జె.పురం ప్రసిద్ధి కెక్కింది. 1957లో అప్పటి గ్రామ సర్పంచ్ పాలకుర్తి శ్రీరామూర్తి గాంధీ, నెహ్రూ, బోస్ విగ్రహాలను బొంబాయి నుంచి తీసుకొచ్చి గ్రామంలో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఇక్కడ గాంధీ జయంతి, వర్థంతి ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 2వ తేదీ బుధవారం ఇక్కడి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించనున్నట్టు స్థానిక నాయకులు తెలిపారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

గొలుగొండ: గ్యాస్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నర్సీపట్నం డివిజన్ ఇండియన్ గ్యాస్ మేనేజర్ రమణ తెలిపారు. లింగంపేటలో మహిళలకు గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించారు. గ్యాస్ ఎలా వాడాలి, ఎలా పొదుపు చేయాలి , ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి మహిళకు వివరించారు.

బాగుపడే మార్గం లేదా...!

- రహదారులు గోతులమయం
- వాహనదారులకు నిత్యం నరకం
- మరమ్మతులకు నోచని వైనం



కె.జె.పురం-దబ్బకుంటు మార్గంలో కోతకు గురైన రోడ్డు



జంపెన వద్ద ప్రధాన రహదారి మీద భారీ గోతులు

మాడుగుల రూరల్ : గ్రామాలల్లో రహదార్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దీంతో పాటు ప్రధాన రహదారిలో ప్రయాణం నరకంగా మారింది. ఇటీవలి వర్షాలకు ఈ దారులు మరింత ఛిద్రమయ్యాయి. నూతన ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి అయింది. రహదారుల మరమ్మతులకు పెద్దపీట వేస్తామని ఎన్నికల సమయంలో నమ్మబలికిన కూటమి నేతలు ఇపుడు ఆ సంగతే మరిచారని జనం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు గత ప్రభుత్వం ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టింది. అయితే మితిమీరిన లోడుతో పెద్ద పెద్ద భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో ఈ రహదారులు దెబ్బతిన్నాయి. ప్రధానంగా వడ్డాది నుంచి పాడేరు పోవు రహదారి నరకాన తలపిస్తుంది. ఈ రహదారి మీద పలు చోట్ల భారీ గండ్లు, గోతులు పడ్డాయి. ముకుందపురం, ఎం.కోటపాడు, సాగరం, సురవరం, ఎం.కోడూరు, తాటిపర్తి, తదితర చోట్ల పూర్తిగా రహదారి శిథిలమైంది. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

➡ కె.జె.పురం జంక్షన్ వద్ద ఐదు మాసాల క్రితం ఎం.కోటపాడు గ్రామానికి చెందిన ఒక వివాహిత మహిళ ద్విచక్రవాహనం మీద నుంచి గోతిలో పడి ముందు వెళ్తున్న లారీ చక్రం కింద పడి చనిపోయింది. ఈ రహదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఘాట్‌రోడ్డు నుంచి కింతలి పోవు రహదారిలో జంపెన గ్రామం వద్ద రహదారి పూర్తిగా దెబ్బతింది. వర్షం వస్తే ఈ రహదారిలో ప్రయాణించడానికి వాహనదారులు నరకం చూస్తున్నారు.

➡ కె.జె.పురం జంక్షన్ నుంచి ఎరుకువాడ లక్ష్మీపురం రహదారి కూడా పూర్తి శిథిలావస్థకు చేరింది. ఈ రహదారి గుండా వీరనారాయణం, జి. అగ్రహారం, గ్రామాలకు పోవడానికి వెళ్లే మార్గంలో కూడా రహదారి ధ్వంసమైంది.

➡ కె.జె.పురం నుంచి దబ్బకుంటు రహదారిలో రెండు చోట్ల రహదారి కోతకు గురైంది. విజయరామరాజుపేట వద్ద వంతెన పూర్తిగా దెబ్బతినడంతో తాత్కాలిక కాజ్‌వే మీద నుంచి వర్షపు నీరు ప్రవహించే సమయంలో పాడేరు- చోడవరం, విశాఖ బస్సు సర్వీసులు కె.జె.పురం గ్రామం మీదుగా నడిపేవారు. దీనివల్ల కె.జె.పురం గ్రామంలో శాలిపేట మదుం వద్ద కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. దీంతో పాటు తాచేరు నది వద్ద కల్వర్టుకు గండి పడింది. ఆయా రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

➡ మండలంలో గిరిజన శివారు గ్రామాలకు గత ప్రభుత్వం హయాంలో రహదారులు నిర్మించారు. రహదారులు నిర్మించని గ్రామాలకు రహదారులు నిర్మాణం చేపట్టాలని, పలు చోట్ల కల్వర్టులు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పక్కా రోడ్లు నిర్మించాలి



గిరిజన గ్రామాలకు పూర్తి స్థాయిలో తారు రోడ్లు నిర్మించాలి. గత ప్రభుత్వం హయాంలో కొన్ని రోడ్లు నిర్మించారు. గిరిజన పంచాయతీలైన తాటిపర్తి, శంకరం, జాలంపల్లి, అవురువాడ పంచాయతీల పరిధిలో గల కొన్ని గ్రామాలకు పూర్తి స్థాయిలో ఈ ప్రభుత్వం పక్కా రోడ్లు నిర్మించాలి. ఎన్నికల ముందు రహదారుల నిర్మాణానికి పెద్ద పీట వేస్తామని హామీ ఇచ్చారు. ఆర్ అండ్‌బీ పరిధిలో గల ప్రధాన రహదారులను తిరిగి పక్కాగా నిర్మించాలి.

– ఇరటా నర్సింహమూర్తి, సీపీఎం మండల కార్యదర్శి, మాడుగుల

రోడ్ల అభివృద్ధికి చర్యలేవీ..



ఏజెన్సీ ముఖ ద్వారం అయిన వడ్డాది-పాడేరు రహదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలి. అల్లూరి, అనకాపల్లి జిల్లాల నుంచి ఇటు పాడేరు, అటు అనకాపల్లి, చోడవరం, విశాఖ, నర్సీపట్నం, చేరుకోవడానికి ఈ రహదారి ప్రధానం. దీనికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలి. ద్విచక్రవాహనదారులు, ప్రైవేటు వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– సయ్యపురెడ్డి నారాయణరావు, మాజీ సర్పంచ్, వి.వి.అగ్రహారం

నిత్యం ఇబ్బందులు



ప్రస్తుత రహదారుల మీద ప్రైవేటు వాహనాలు తిరగడం ఇబ్బందికరంగా వుంది. రహదారులన్నీ గోతులుమయంగా మారడంతో వాహనాలు నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి. దీనివల్ల నిత్యం పెట్టుబడి పెట్టలేకపోతున్నాం. ప్రధాన రహదారులన్నీ బాగు చేయాలి.

– బల్లంకి అమ్మతల్లినాయుడు, ఆటోడ్రైవరు, కె.జె.పురం, మాడుగుల మండలం

వలంటీర్లను ఆదుకోవాలి



ఎంపీడీవో సాంబశివరావుకు వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు

కె.కోటపాడు : వలంటీర్ల సేవలను కొనసాగిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని మండలానికి చెందిన వలంటీర్లు కోరారు. తమను విధుల్లోనికి తీసుకోవాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మండలంలో గల 32 పంచాయతీలకు చెందిన వలంటీర్లు మంగళవారం వినతిపత్రం అందించారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వలంటీర్లు బి.నాగభూషణం, కె.దేవి, బి.రమాదేవి, పి.సంతోషి, పైల అప్పలనాయుడు మాట్లాడుతూ వలంటీర్లుగా రాజీనామా చేసిన వారితో పాటు చేయని వారిని కూడా వలంటీర్లుగా కొనసాగించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్ల వేతనాన్ని నెలకు రూ.10 వేలు అందించాలని, జాబ్ చార్ట్‌ను అందించాలని కోరారు. నాలుగు నెలలు నుంచి పెండింగ్‌లో ఉన్న వలంటీర్ల గౌరవ వేతనాన్ని విడుదల చేయాలని కోరారు.

అక్రమ లేఅవుట్ పనులను ఆపాలి

కె.కోటపాడు : ఆర్లి గ్రామంలో వీఎంఆర్‌డీఏ నుంచి పూర్తి స్థాయి అనుమతులు లేకుండానే అక్రమ లేఅవుట్ నిర్మాణం చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న పత్రికా ప్రకటన ద్వారా ఆరోపించారు. 46 ఎకరాల భూమిలో కేవలం 18 ఎకరాల్లో లేఅవుట్ నిర్మాణానికి వైభవ్ హెబటేట్స్ అనుమతులను పొందిందని అన్నారు. అనుమతులు ఉన్న భూమితో పాటు అనుమతులు లేని భూమిలో కూడా లేఅవుట్ నిర్మాణం చేస్తున్నట్లు వెంకన్న అన్నారు. లే అవుట్‌లో భూమిని చదును చేసేందుకు ప్రభుత్వ భూమిలో గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారన్నారు. అధికారులు పూర్తి విచారణ చేసి, అనధికారిక లేఅవుట్‌పై చర్యలు తీసుకోవాలని వెంకన్న కోరారు.

వరిలో సమగ్ర సస్య రక్షణ చర్యలు అవసరం



గొండుపాలెంలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

కె.కోటపాడు : రైతులు వరిపంటలో సమగ్ర సస్య రక్షణ చర్యలను చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. గొండుపాలెంలో మంగళవారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఖరీఫ్‌లో పంటలను సాగు చేస్తున్న రైతులకు ఆయన సూచనలను ఇచ్చారు. ప్రస్తుతం వరిపంటకు కాండం తొలిచే పురుగు, ఆకు, పొడతెగుళ్ల సోకే పరిస్థితి ఉందన్నారు. వీటి నుండి పంటను రక్షించుకునేందుకు కాండం తొలిచే పురుగు, ఆకుముడత తెగులు నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ మిశ్రమాన్ని ఎకరా పొలానికి 400 గ్రాముల మిశ్రమాన్ని 200 లీటర్ల నీటిలో వేసి పిచికారి చేయాలని తెలిపారు. పొగతెగులు నివారణకు ప్రోపకొనజోల్ 1ఎంఎల్‌ను 1 లీటర్ నీటిలో వేసి పిచకారి చేయడం వల్ల పంటను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చన్నారు. వేరుసెనగ పంట పూతదశలో ఉన్న సమయంలో పంట గొప్పులో ఎకరానికి 200 కిలోల జిప్సం వేయడం వల్ల పంటలో నూనె శాతం పెరుగుతుందని తెలిపారు. డిసెంబర్‌లోగా నువ్వు పంటను రైతులు వేయాలన్నారు. నువ్వుపంటలో బొబ్బరి, చిక్కుడు పంటలను వేయడంతో పాటు గట్టుచుట్టూ గంటి, మొక్కజొన్న పంటలను నాటాలని సూచించారు. దీనివల్ల బూడిద తెగులు పంటలకు ఆశించదన్నారు. రబీలో మండలంలో వేరుసెనగ పంటను సాగు చేసే రైతులకు రాయితీపై విత్తనాలను అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.సోమశేఖర్, వ్యవసాయ విస్తరణాధికారి లైలాదేవి పాల్గొన్నారు.

మద్యం దుకాణాల సిబ్బంది నిరసన



మాడుగుల ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

మాడుగుల రూరల్: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సేల్స్‌మన్‌లు, పర్యవేక్షకులకు ఉపాధి కల్పించాలని కోరుతూ మంగళవారం ఉదయం మాడుగుల ప్రభుత్వ మద్యం షాపు వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానం వల్ల, తమకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. నూతన మద్యం విధానికి వ్యతిరేకులు కామని, గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వ మద్యం షాపులల్లో పనిచేస్తున్న తమకు ప్రస్తుతం ఇస్తున్న ప్రైవేటు షాపుల్లో ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు.

దేవరాపల్లి: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దేవరాపల్లిలోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద మండల పరిధిలోని సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్స్, వాచ్‌మెన్స్ ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేతపట్టి ఉద్యోగ భద్రత కల్పించి తమను ఆదుకోవాలని నినాదాలు చేశారు. సెప్టెంబర్ 30తో తమ కాల పరిమితి ముగిసిందని, తమకు ఎటువంటి ప్రభుత్వం నుండి ఎటువంటి సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటీకరణతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15వేల మంది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు.

చోడవరం: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చోడవరం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. సాయంత్రం వరకూ షాపులు తెరుచు కోలేదు. అనంతరం అధికారులకు వినతి అందజేశారు.

రైతులంతా పంటలు నమోదు చేసుకోవాలి

చోడవరం ఏడీఏ రవీంద్రనాథ్ సూచన

దేవరాపల్లి : ప్రతి రైతు తప్పనిసరిగా పంటల నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని చోడవరం ఏడీఏ వి.రవీంద్రనాథ్ సూచించారు. దేవరాపల్లి, రైవాడ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. దేవరాపల్లిలో జరిగిన సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ పంటల నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాలు, ఇతరత్రా రాయితీలు వర్తించడంతో ధాన్యం విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఖరీఫ్ వరిలో పలు గ్రామాల్లో పోటాష్ లోపం ఉందని, ఈ లోపం ఉన్న పొలాల్లో ముదురు ఆకుల చివర్లు ఎర్రగా మారుతాయన్నారు. దీని నివారణకు ఎకరానికి 15 కేజీల పొటాషియం వేసుకోవాలని రైతులకు సూచించారు. పొచి, పొడ తెగులు నివారణకు ప్రోపికోనజోల్ 200 మిల్లీ లీటర్లను లేదా వాలిడామైసిన్ 400 మిల్లిలీటర్లను లేదా అజాక్సిస్ట్రోబిన్ 200 మిల్లీలీటర్లను ఎకరానికి పిచికారి చేయాలని వివరించారు. వరి కోతలు అనంతరం మినుములు, పెసలు, నువ్వులు, వేరుశనగ వేసే రైతులు కొత్త వంగడాలు వేసేందుకు సుముఖంగా ఉన్న రైతుల వివరాలను రైతు సేవా కేంద్రాలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో దేవరాపల్లి, రైవాడ సర్పంచ్‌లు పెంటమ్మ, చల్లా లక్ష్మి, ఎంపీటీసీ కృష్ణమూర్తి, మండల వ్యవసాయ అధికారి కాంతమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు డిమాండ్

నాతవరం : కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక కొరత తీవ్రంగా వెంటాడుతుందన్నారు. దీంతో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక అల్లాడిపోతున్నారన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో ఇసుక విచారణ పేరుతో కూటమి ప్రభుత్వం ఇసుక సరఫరా పూర్తిగా నిలుపుదల చేసారన్నారు. ఇసుక సమస్య పరిష్కారం చేయకపోతే కూటమి ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేక వస్తుందని హెచ్చరించారు. నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్సు వసూలు చేసి కార్మికుల సంక్షేమానికే ఖర్చు చేయాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన మెమో 1214ను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా భవన నిర్మాణ కార్మికులు సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, మండల శాఖ అధ్యక్షుడు మల్లియ్య, కార్యదర్శి సత్తిబాబు, సంఘ నాయకుడు కోటి శ్రీను, సీపీఎం మండల శాఖ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నల్లగొండమ్మ పండగ



తాండవలో మొక్కులు చెల్లిస్తున్న మహిళలు

నాతవరం : మండలంలో తాండవ డి.యర్రవరం నాతవరం గ్రామాల్లో భక్తులు ఆరాధ్యదైవం నల్లగొండమ్మ తల్లి పండగను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయా గ్రామాల్లో గల ఆలయాల్లో అమ్మవారి దర్శనం కోసం తెల్లవారు నుంచే భక్తులు ఎండలో క్యూలో నిల్చొని పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తాండవ రిజర్వాయరు దిగువనున్న అమ్మవారి అలయం వెళ్లే దారిలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ సిహెచ్.భీమరాజు సిబ్బందితో వెళ్లి భక్తులకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ క్లియర్ చేశారు.నాతవరంలో అమ్మవారి ఆలయానికి ఊహించని విధంగా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. ఇక్కడ ఆలయ కమిటీ చైర్మన్ పోలిరెడ్డి రాజు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఆలయం వద్ద మహిళల భజనలు, కోలాటం భక్తులను రంజింపజేశాయి. డి.యర్రవరం అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా పూలతో ఆలకరించారు. డి.యర్రవరం, తాండవ, నాతవరం గ్రామాల్లో ఆలయాలు వద్ద భక్తులకు ఉచితంగా తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిపారు. మండలంలో ఒకే రోజు మూడు ప్రాంతాల్లో నల్లకొండమ్మ పండగ జరగడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నర్సీపట్నం సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో నాతవరం ఎస్ఐ భీమరాజు అదనంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


తాటిపర్తిలో పౌరహక్కుల దినోత్సవం

మాడుగుల: తాటిపర్తి గ్రామంలో పౌర హక్కులు దినోత్సవం మంగళవారం నిర్వహించారు. గ్రామంలో గల ఎస్సీ, ఎస్టీలకు చెందిన పలు సమస్యలు గురించి చర్చించారు. బంజరు భూములను గుర్తించి ఎస్సీ, ఎస్టీలుకు ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో స్మశానానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. విద్యుత్, తాగునీటి సమస్యలు వివరించారు. అనంతరం అధికారులు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ కమిటీ సభ్యులు మరువాడ ఈశ్వరావు, మండల పంచాయతీ విస్తరణాధికారి మీనాకుమారి, డిప్యూటీ తహసీల్దారు లక్ష్మయ్య, సర్పంచ్ అల్లంగి వెంకట గౌరీదేవి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విజేతకు అభినందన

కె.కోటపాడు : కళాశాల విద్యార్థులకు జిల్లా స్థాయిలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-2047 వ్యాసరచన పోటీల్లో కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పి.హాసిని ఉత్తమ ప్రతిభతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆమెకు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ జ్ఞాపికను అందించి ప్రశంసాపత్రంతో అభినందించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి మంగళవారం కళాశాలలో విద్యార్థినిని అభినందించారు. రూ.1000 సొంత నగదును విద్యార్థినికి అందించి ప్రోత్సహించారు. అనకాపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో 77 మంది విద్యార్థుల్లో తమ కళాశాల విద్యార్థిని ద్వితీయ స్థానంలో నిలవడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ నాగమణి అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసాద్, రాజనాయుడు పాల్గొన్నారు.

చోడవరంలో న్యాయ విజ్ఞాన వేదిక



వేదికపై మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్యకళ

చోడవరం రూరల్: చోడవరం ప్రేమ సమాజం వద్ద మంగళవారం ఇంటర్‌నేషనల్ సీనియర్ సిటిజన్ డే కార్యక్రమాన్ని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇక్కడ పాల్గొన్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ సీనియర్ సిటిజన్ల గురించి మాట్లాడారు. సమాజంలో వయోవృద్ధులను గౌరవించి జీవన విధానంలో వారి అనుభవాలను గురించి తెలుసుకుని పాటించాలన్నారు. అలాగే న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించారు.

ఒమ్మలి విద్యార్థుల ప్రతిభ

మాడుగుల రూరల్ : మండలంలో ఒమ్మలి జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు గత నెల 27, 28, తేదీల్లో చొడువాడలో జరిగిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనపరిచారు. అండర్ 17 విభాగంలో ఖోఖో విభాగంలో విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించారు. అలాగే 15 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఘనంగా లలితాదేవి వృద్ధాశ్రమం వార్షికోత్సవం



వృద్ధులను సత్కరించిన ఎంపీపీ శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మ



మాడుగులలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణముఖి

చీడికాడ: అప్పలరాజుపురం శ్రీ లలితాదేవి వృద్ధాశ్రమం స్థాపించి 13 సంవత్సరాలు పూర్తి కావస్తున్న తరుణంలో మంగళవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు యాళ్ల వెంకటలక్ష్మి ఎన్నో ఒడిదోడుకులను ఎదుర్కొని, నేడు ఎంతో మంది వృద్ధులకు నీడ కల్పిస్తున్నారని పలువురు అభినందించారు. ఆశ్రమానికి ప్రతి నెలా కిరణా సరుకులు అందించే ఆశ్రమ కోశాధికారి పి. సత్యనారాయణరావు, వారి కుటుంబ సభ్యుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు వెంకటలక్ష్మిని సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

మాడుగుల: మాడుగుల సెయింట్‌ఆన్స్ వృద్ధాశ్రమంలో మంగళవారం వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణముఖి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకులను అభినందించారు. అనంతరం వృద్ధుల గదులు, భోజనశాల, వంటశాల, మరుగుదొడ్లు పరిశీలించారు.

గొలుగొండ: గొలుగొండ పీహెచ్‌సీలో మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో ఉన్న వృద్ధులకు సన్మానం చేశారు. వైద్యాధికారి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ముందు తరాల్లో ఆహారపు అలవాట్లపై ఇప్పుడు ఉన్న వారికి అవగాహన తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా శరణాలయంలో వృద్ధులకు సత్కారం

రోలుగుంట : కొవ్వూరులో సుమారు 30 ఏళ్లుగా నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర యువజన సంఘం వృద్ధుల మహిళా శరణాలయంలో మంగళవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాల్లో రూరల్ ప్రాంతంలో కన్నబిడ్డల నిరాదరణకు గురైన వారికి ఈ ఆశ్రమం అండగా నిలుస్తోందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు రాజారావుని వైఎస్సార్‌సీపీ ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మ అభినందించారు, ఆశ్రమంలో ఉంటున్న కొటవురట్ల మండలం బాపిరాజు కొత్తపల్లికి చెందిన పైల వెంకట సత్యవతి(70)రావికమతం మండలం కొత్తకోటకు చెందిన జానికమ్మ (80)ను సాలువాతో సత్కరించారు. వృద్ధులందరికీ పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

వసతి గృహం ప్రారంభోత్సవం వాయిదా

రోలుగుంట: జె.నాయుడుపాలెం గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న బాలికల వసతి గృహం ప్రారంభోత్సవం వాయిదా పడింది. జె.నాయుడుపాలెం గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో రూ.2.54 లక్షలతో బాలికల వసతి గృహం నిర్మాణం పూర్తి చేశారు. గత నెల ఈ వసతి గృహంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ కూడా జరిగింది.

బుధవారం ఈ భవనానికి ప్రారంభోత్సవం చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే అనివార్య కారణాల వల్ల కార్యక్రమం వాయిదా పడిందని హెచ్ఎం రమేష్ కుమార్ తెలిపారు.

పామాయిల్ గెలలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మాడుగుల రూరల్ : పామాయిల్ గెలలు కోసిన తర్వాత, వాటిని వర్షాలకు తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఉద్యానవనశాఖాధికారి వి. భానుపుష్పలీలావతి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాడుగుల, బుచ్చెయ్యపేట, మండలాల్లో సాగువుతున్న పామాయిల్ తోటలను పరిశీలించారు. ఈ-పంట జరిగిన తర్వాత గెలలు కోసిన వెంటనే నాణ్యత తగ్గకుండా, వర్షాలకు తడవకుండా టార్పలిన్లు కప్పాలని, దీని వల్ల రైతులకు మంచి ధర లభిస్తుందన్నారు. ఈ విషయాన్ని పామాయిల్ రైతులు తెలుసుకోవాలన్నారు. అలాగే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా, జి.అగ్రహారం, వీరనారాయణం గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఉద్యానవన పంటల ద్వారా అందిస్తున్న రాయితీల గురించి రైతులకు వివరించారు. వరి పంట తీసిన తర్వాత కాయగూరలు పండించుకోవాలని సూచించారు. కూరగాయల పంటలకు అందిస్తున్న రాయితీలు గురించి సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

ప్రతిభాపాటవ పరీక్షలు

నర్సీపట్నం : జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా ప్రతిభాపాటవ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని 20 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయి పోటీ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ స్థానంలో ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, ద్వితీయ స్థానం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(మెయిన్), ప్రైవేట్ పాఠశాలలో ప్రథమస్థానంలో అమరావతి స్కూల్, ద్వితీయ స్థానంలో డాన్‌బాస్కోస్ స్కూల్ అర్హత సాధించాయి.